
సాక్షి నంద్యాల

సోమవారం ; 24 ; ఏప్రిల్ ; 2023



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన పి.ఆనంద్‌రెడ్డి రూ.1,01,000 విరాళం అందించారు. దాతకు జ్ఞాపికను అందజేశారు.



మహానందిలో సండేసందడి

మహానంది: సెలవురోజు కావడంతో మహానంది ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల భక్తులు మహానందీశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



భ్రామరికి పల్లకీ సేవ

శ్రీశైలం: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి వార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆలయ ప్రదక్షిణ చేశారు.

న్యూస్‌రీల్

శ్రీశైలంలో భక్తుల రద్దీ



క్యూ కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం: జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తిపీఠంగా కలిసివెలిసిన శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం సెలవు రోజు కారణంగా భక్తుల రద్దీ పెరిగింది. ఉభయతెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. భక్తులు మల్లన్న దర్శనార్థమై ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకోవడంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు నిండిపోయాయి. క్యూలలో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం సిబ్బంది మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఆలయపూజావేళల్లో మార్పులు చేశారు.

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

నేరాల నివారణకు నిరంతర గస్తీ



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జిల్లాలో నేరాల నియంత్రణకు వాహనాలతో పోలీసులు నిరంతర గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో కొత్త 15 హీరో బైక్‌లను గస్తీ నిమిత్తం ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శక్తి టీమ్‌కు 6 బైక్‌లు, ఉమెన్ హెల్ప్‌డెస్క్ కోసం 29 వాహనాలు, బ్లూకోట్స్‌కు 58 వాహనాలు ఉండగా మరో 15 వాహనాలు అదనంగా ప్రారంభించామన్నారు. ప్రజల శాంతిభద్రతల కోసం రాత్రి గస్తీని ముమ్మరం చేశామన్నారు. జిల్లా కేంద్రంలో ఇప్పటికే 24 వాహనాలు గస్తీ కోసం వినియోగిస్తున్నామని వివరించారు. జిల్లా కేంద్రంలో నేరాల కట్టడి కోసం 239 సీసీ కెమెరాలు, 62బృహస్పతి, 117 మ్యాట్రిక్స్ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రమణ, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐలు పాల్గొన్నారు.

నకిలీ వెబ్‌సైట్‌ను నమ్మొద్దు

- మే 1 నుంచి శ్రీశైల దేవస్థానం వెబ్‌సైట్ ప్రారంభం

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించడానికి వచ్చే భక్తులు శ్రీశైల అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే ఆర్జితసేవ టిక్కెట్లు, దర్శన టిక్కెట్లు, ఇతర సేవ టిక్కెట్లతో పాటు ముందస్తు వసతి రిజర్వేషన్ కోసం వినియోగించుకోవాల్సిందిగా దేవస్థానం ఈఓ లవన్న ఆదివారం తెలిపారు. ఇందుకోసం దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ www.srisailadevastanam.org, www.aptemples.ap.gov.in లను మాత్రమే వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఈ వెబ్‌సైట్ల ద్వారా శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, స్పర్శదర్శనం, ఆర్జితసేవాటి టిక్కెట్లన్నింటిని పొందుపరిచామని తెలిపారు. దేవస్థానం, దేవదాయశాఖ వెబ్‌సైట్ కాకుండా భక్తులు ఇతర నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. మే 1వ తేదీ నుంచి దేవస్థానం వెబ్‌సైట్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా సెల్వర్ కూత్తు ఉత్సవం



పల్లకీలో ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి సెల్వర్ కూత్తు ఉత్సవం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నారసింహ స్వామి జయంతి మహోత్సవాలు ప్రారంభానికి ముందు సెల్వర్ కూత్తు (నిత్య ఉత్సవమూర్తికి) ఉత్సవం నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా దిగువ అహోబిలంలో శ్రీ ప్రహ్లాదవరద స్వామిని కొలువుంచి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తిరమంజనం నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవ పల్లకీలో కొలువుంచి మాఢ వీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

పశు రథం కదలగా.. మూగ వేదన తీరగా..



మొబైల్ అంబులేటరీలో జిల్లా పశువైద్యశాలకు చేరిన గేదెకు వైద్యం అందిస్తున్న దృశ్యం

కాడెద్దుల మెడలో గంటలు మోగినట్లుగా, కోడెదూడలు, గేదెలు అంబా అని అరిచినట్లుగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడు సరికొత్త హారన్ వినిపిస్తోంది. కుయ్..కుయ్ మంటూ 108 వాహనం తరహాలో 1962 వాహనం పశువుల పాలిట ఆపద్బాంధవిగా మారింది. 'వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ' రథాలు మూగజీవాలకు అపర సంజీవనిగా నిలుస్తున్నాయి. ఫోన్ చేస్తే చాలు పశు వైద్య సిబ్బంది గంటల్లో అక్కడికి చేరుకుని క్షణాల్లో పశువుల ఆరోగ్యాన్ని పరీక్షించి మందులివ్వడం, అత్యవసరమైతే సర్జరీలు సైతం చేసి వాటిని కాపాడుతున్నారు. జిల్లాలో 11 నెలల్లో 17,578 మూగజీవాలకు పశు సేవా రథ సిబ్బంది వైద్యం అందించారు.

- సత్ఫలితాలిస్తున్న 'వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ' రథాలు
- ప్రతి వాహనంలోనూ లేబొరేటరీ
- క్షణాల్లో రక్త, పేడ పరీక్షలు
- అత్యవసర పరిస్థితుల్లో సర్జరీలు
- టోల్‌ఫ్రీ నం 1962కు విశేష స్పందన

ఆళ్లగడ్డ: వ్యవసాయానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం అనుబంధ రంగసంస్థ అయిన పశు సంపద పరిరక్షణకు ఎంతో కృషి చేస్తోంది. 'వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ'ను అందుబాటులోకి తెచ్చి పాడి రైతులకు అండగా నిలిచింది. గత సంవత్సరం మే 19న నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాకు 7 వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో భాగంగానే '1962 టోల్ ఫ్రీ నంబరును తెచ్చి క్షేత్ర స్థాయిలోకి సంచార వైద్య సేవలను అందిస్తోంది. గతంలో పశువులు వ్యాధులు బారిన పడినప్పుడు, ఏదైనా ప్రమాదాలకు గురైనప్పుడు చికిత్స కోసం దూర ప్రాంతాల్లోని పశు వైద్యశాలకు తీసుకెళ్లాలంటే రైతులు ఎంతో వ్యయ ప్రయాసలు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో రైతుల ముంగిటకు పశు వైద్యు సేవలు అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకు వచ్చిన 'వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ' సత్ఫలితాలనిస్తోంది. జిల్లాలో ఆవులు, ఎద్దులు 1,20,565, గేదెలు, దున్నలు 2,93,830, గొర్రెలు 8,82,449, మేకలు 3,05,854, కోళ్లు 7,01,126 ఉన్నాయి. ఇంతటి పశు సంపదకు 108 అంబులెన్స్ తరహాలోనే అత్యవసర వైద్యమందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 1962 టోల్ ఫ్రీ నంబర్ కేటాయించింది. ఈ నెంబరుకు కాల్ చేసిన వెంటనే సంబధిత వాహనాల్లో పశు వైద్య సిబ్బంది గ్రామాలకు చేరుకుని మూగజీవాలకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అవసరమైతే ఆ పశువును వాహనంలో ఎక్కించుకుని నియోజకవర్గ, జిల్లా పశు వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం మళ్లీ పశు యజమాని ఇంటి దగ్గర దించి వస్తున్నారు. అత్యవసరమైతే పక్క జిల్లాల పశు వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్సలు అందిస్తున్న సందర్భాలు ఉన్నాయి. పశు సేవ రథాల సేవలకు విశేష స్పందన రావడంతో రెండో విడతగా ఈ ఏడాది జనవరి 26న నియోజకవర్గానికి మరో ఏడు 1962 అంబులెన్స్ కేటాయించారు. ప్రస్తుతం జిల్లాలో 14 వాహనాలు సేవలు అందిస్తున్నాయి. జిల్లాలో 11 నెలల్లో 17,578 పశువులకు అత్యవసర వైద్యం అందింది.



రుద్రవరం మండలం కొత్తపల్లె గ్రామంలో ఆపరేషన్ చేసి దూడను కాపడిన దృశ్యం

వాహనంలోనే 35 రకాల పరీక్షలు..

1962 సంచార పశువైద్యశాల వాహనాల్లో 20 రకాల పేడ సంబంధిత, 15 రకాల రక్త పరీక్షలు చేయడానికి మైక్రోస్కోప్‌తో కూడిన ప్రయోగశాలను వాహనంలో ఏర్పాటు చేశారు. దీనిద్వారనే పరీక్షలు చేయనున్నారు. వ్యాక్సిన్లు, కొన్నిరకాల మందులు కూడా ఇందులో అందుబాటులో ఉంచారు. అత్యవసర పరస్థితుల్లో పశువును హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యంతో వాహనంలోకి ఎక్కించి సమీపంలోని వైద్యశాలకు తీసుకుపోయే వెసులుబాటుంది.

1962పై విస్తృత ప్రచారం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డాక్టర్ పశు పశువైద్య సేవలకు అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రతి రోజు ఒక్కో వాహనానికి సరాసరి 3 నుంచి 7 కాల్స్ వస్తున్నాయి. అత్యవసర వైద్యచికిత్సలతో పశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఎక్కడైన ప్రమాదం జరిగితే 108 అంబులెన్స్ ఎలా గుర్తుకు వస్తుందో గ్రామాల్లో పశుపోషకులు ప్రతి ఒక్కరి టోల్ ఫ్రీ నంబరు 1962 గుర్తుండేలా ప్రచారం నిర్వహిస్తున్నాం. – నరసింహరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, నంద్యాల



ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

కొన్నాళ్ల క్రితం పశువుల పోట్లాటలో మా గేదె కొమ్ము విరిగిపోయింది. దీంతో తీవ్ర రక్తస్రావమై పశువు నీరసంగా పడిపోయింది. కళ్లు తేలేస్తూ ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో స్థానికులు 1962 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమస్య చెప్పారు. 20 నిమిషాల్లో అంబులేటరీ క్లినిక్ వాహన బృందం గ్రామానికి చేరుకుని రెండు గంటల పాటు గేదెకు శస్త్రచికిత్సలు నిర్వహించారు. గేదెపై ఆశలు వదులుకుని ఆందోళన చెందుతున్న తరుణంలో పశు సేవ రథం గ్రామానికి వచ్చి ప్రాణం పోసింది. ఇంత మంచి పనిచేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటం.

– ప్రమీల, క్రిష్టిపాడు, దొర్నిపాడు మండలం

జిల్లాలో ఇప్పటి వరకు పశువులకు అందిన సేవలు

సంచార వైద్యసేవలు అందిన గ్రామాలు	585
లబ్ధి పొందిన పశు పోషకులు	6,450
అత్యంత క్లిష్ట పరిస్థితుల నుంచి కాపాడిన పశువులు	1,824
అత్యవసర ప్రమాదాల నుంచి కాపాడినవి	4,193
సహజ జబ్బులకు వైద్య సేవలు అందినవి	2,714
సాధారణ సేవలు అందుకున్నవి	13
సర్జరీ చేసిన పశువులు	2,027
ప్రసవం కేసులు	540
మందులు ఇచ్చి వచ్చిన పశువులు	6,053
ఎద సూదులు వేసిన పశువులు	214
1962 ద్వారా జిల్లాలో సేవలు పొందిన మొత్తం పశువులు	17,578

ఆపరేషన్ చేసి గేదెను బతికించారు

మా పాడి పశువు ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు గురైంది. పశువు నిలబడలేక పడుకోలేక అరుస్తూ నరకయాతన పడింది. ఇక గేదె బతుకుతుందని ఆశ వదులుకుంటున్న సమయంలో చివరి ప్రయత్నంగా 1962కు ఫోన్ చేశాం. సమాచారం అందుకున్న మొబైల్ అంబులేటరీ సిబ్బంది గ్రామానికి చేరుకుని పరిశీలించారు. గేదె పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో ఆళ్లగడ్డకు పశు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ శస్త్రచికిత్స చేసి లోపల ఉన్న చెడు పదార్థాలను తీసి కుట్లు వేశారు. అనంతరం సురక్షితంగా గ్రామానికి చేర్చారు. అధికారులకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు

– రసూల్‌బీ, ఆర్ కృష్ణాపురం, ఆళ్లగడ్డ మండలం



ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కర్నూలు(అర్బన్): అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగిందని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి తెలిపారు. కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 6 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించినట్లు చెప్పారు. 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించి మొత్తం 1,040 సీట్లకు గాను 10,514 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. రాత పరీక్షకు 9,154 మంది హాజరయ్యారని, 1,360 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు మొత్తం 1,400 సీట్లకు గాను 6,056 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 5,209 మంది హాజరయ్యారని, 847 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.



వైభవంగా బసవ జయంతి

కరూనలు జిల్లాలో బసవ జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. బసవేశ్వరస్వామి చిత్ర పటానికి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఎద్దులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. - హొళగుంద

రేపు డీసీసీబీ బోర్డు సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్.మహాలక్ష్మి అధ్యక్షతన జరగనుంది. నాబార్డు ఆడిట్ పూర్తి అయిన సందర్భంగా జరుగుతున్న సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో డీసీసీబీకి పెద్ద ఎత్తున లాభాలు వచ్చినట్లు తెలుస్తోంది. లాభాలను ప్రకటించడంతో పాటు డీసీసీబీలో సభ్యులైన ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు డివిడెంట్ కూడా ఇచ్చే అవకాశం ఉంది. బోర్డు సమావేశంలో డీసీఓతో నాబార్డు, ఆప్కాబ్ అధికారులు కూడా పాల్గొంటారు.

భానుడి భగభగలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా లో ఎండల మండుతున్నాయి. మధ్యాహ్నం 3 గంటల సమయానికి నంద్యాల జిల్లా శ్రీశైలంలో 42.66 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గోస్పాడులో 42.49, పాణ్యం మండలం గోనవరంలో 42.35, కర్నూలు జిల్లా మంత్రాలయంలో 42.31, కర్నూలు నగరం బుధవారపేటలో 41.47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యా యి. నంద్యాల జిల్లాలోని అవుకులో 23.4 మి.మీ, పగిద్యాలలో 6.8, నందికొట్కూరులో 5.4, జూపాడుబంగ్లాలో 3.4 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదం ఉందని, ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు సూచించారు.

లోకేశ్.. రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న బీవై రామయ్య, చిత్రంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు

- అసత్య ఆరోపణలు చేస్తే కర్నూలు దాటలేవు
- విలేకరుల సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు(సెంట్రల్): నారా లోకేశ్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదని, రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేస్తే పాదయాత్ర కర్నూలు దాటబోదని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ..ఇటీవల ఓ జాతీయ సర్వే విడుదల చేసిన ఫలితాలతో టీడీపీ మైండ్ బ్లాక్ అయిందన్నారు. ఆ సర్వేలో వైఎస్ఆర్‌సీపీ 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలు గెలుస్తుందని చెప్పడంతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, లోకేశ్ ఫ్రస్టేషన్‌లోకి వెళ్లిపోయారన్నారు. అధికారంలోకి రాలేమన్న కోపంతో చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో మంత్రి ఆదిమూలపు సురేష్ కార్యాలయం ముందు వెళ్లి రెచ్చగొట్టారన్నారు. చంద్రబాబు కాన్వాయ్‌లో కర్రలు, కట్టెలు, ఆయుధాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎమ్మెల్యేలపై లేనిపోని ఆరోపణలు చేసి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

రుజువులు లేకుండా ఆరోపణలా?

నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ..2019లో టీడీపీకి ప్రజలు గుణపాఠం చెప్పారని, 2024లో పార్టీ అడ్రస్ గల్లంతు అవుతుందన్న భయంతో చంద్రబాబు, లోకేశ్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారన్నారు. రుజువులు లేకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. ఏది పడితే అది మాట్లాడితే ప్రజలు సహించబోరన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చినప్పటి నుంచి ప్రజలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొంది జీవన గమనంలో ఎన్నో మార్పులు చేసుకున్నారన్నారు. దీనిని మరిపించేందుకు టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. లోకేశ్ అజెండా లేకుండా పాదయాత్ర చేస్తున్నారన్నారు. హామీలన్నింటిని అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌పై విమర్శలు చేయడం టీడీపీకి తగదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, వైఎస్ఆర్‌సీపీ నంద్యాల జిల్లా మైనార్టీ అధ్యక్షుడు యూనస్ బాషా, డిప్యూటీ మేయర్ రేణుకారెడ్డి సిద్ధారెడ్డి తదితరులు మాట్లాడారు.

సేవల్లో సూపర్ ఫస్ట్!

- ఆర్టీసీలో కార్గో సేవలకు పెరుగుతున్న ఆదరణ
- కొరియర్ సర్వీసుల కంటే వేగంగా సరుకుల రవాణా
- సేవల్లో రాయలసీమలో నంద్యాల ఫస్ట్
- 2022–23లో రూ.3.93 కోట్ల ఆదాయం
- నగదు రహిత చెల్లింపులకు శ్రీకారం



నందికొట్కూరు బస్టాండ్‌లో పార్సిల్ కార్యాలయం



నందికొట్కూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో రవాణా బస్సు

నందికొట్కూరు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం..సుఖమయం అంటారు. ఇప్పుడు కార్గో సేవల్లోనూ ఆ సంస్థ అధికారులు అదే మంత్రాన్ని పఠిస్తున్నారు. సరుకులను సురక్షితంగా, సమయానికి గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. ఇతర కొరియర్ సర్వీస్‌ల కంటే వేగంగా సేవలందుతుండటంతో కార్గో సర్వీస్‌ను బుక్‌చేసుకునే వారి సంఖ్య అధికమవుతుంది. ఈ సేవల్లో, ఆదాయంలో రాయలసీమలో నంద్యాల జిల్లా ఆర్టీసీ మొదటి స్థానంలో నిలవడం విశేషం.

కరోనా సమయంలో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. రాకపోకలపై ఆంక్షలు అమలయ్యాయి. ఈ సమయంలో ఆర్టీసీ ఆదాయం పడిపోవడంతో సంస్థ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. ఇందులో సరుకులు, పార్సిల్ రవాణా కోసం కార్గో సర్వీస్‌ను ప్రవేశపెట్టింది. మొదట్లో ఈ కార్గో సేవలను ముఖ్యమైన ఆర్టీసీ కాంప్లెక్స్‌లకు మాత్రమే పరిమితం చేసింది. అధికారులు అక్కడే ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేసి సరుకులు రవాణా చేసేవారు. ప్రజల నుంచి ఆదరణ పెరగడంతో సేవలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించారు. అలాగే నగదు రహిత చెల్లింపులకు శ్రీకారం చుట్టారు. గతేడాది సెప్టెంబర్ 1వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో 10 కేజీల వరకు బరువు ఉండే సరుకులను 10 కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ చేయడం ప్రారంభించారు. దీనికి అన్యూహ స్పందన లభించడంతో అక్టోబర్ 1వ తేదీ నుంచి 50 కేజీల బరువు వరకు సరుకులను డోర్ డెలివరీ చేస్తున్నారు. ఈ విధంగా చేయడంతో ద్వారా నంద్యాల జిల్లాలో 2022–23లో ఆర్టీసీకి రూ. 3.93 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో నంద్యాల రూ, 2. 10 కోట్లు, నందికొట్కూరు రూ. 29. 88 లక్షలు, ఆత్మకూరు రూ, 39. 71, బనగానపల్లె రూ. 11. 70, ఆళ్లగడ్డ రూ. 44. 59 లక్షలు, కోవెలకుంట్ల రూ. 8. 80, డోన్ రూ. 48. 14 లక్షలు వరకు వచ్చింది. బస్‌స్టేషన్ పాయింట్ల ద్వారా 10 కిలోమీటర్ల పరిధిలో 50 కేజీల బరువు వరకు సరుకులను డోర్ డెలివరీ చేస్తున్నారు. ఇలా పార్సిల్ ద్వారా ఆర్టీసీ ఆదాయం క్రమంగా పెరుగుతుంది. 2023–24కు రూ.12 కోట్ల ఆదాయం సాధించాలని టార్గెట్ పెట్టుకున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారులు తెలిపారు.

కార్గో సేవలు భేష్



ఆర్టీసీ కార్గో సేవలు బాగున్నాయి. మనం బుక్ చేసుకుంటే చాలు ఇతర కొరియర్ సర్వీస్‌ల కంటే వేగంగా తీసుకొచ్చి ఇస్తున్నారు. గతంలో బస్సుల్లో ఏదైనా పార్సిల్ వస్తే అనేక ఇబ్బందులు పడుతూ ఆటో, రిక్షాల ద్వారా ఇంటికి చేర్చుకునేవాళ్లం. ఇప్పుడు ఇంటికే ఆర్టీసీ కార్గో పార్సిల్ సర్వీసు అందిస్తుండటంతో ఆ ఇబ్బందులు లేవు.

– కదిరి సురేష్, నందికొట్కూరు పట్టణం

24 గంటల్లోనే డోర్ డెలివరీ

బుక్ చేసుకున్న 24 గంటల్లో ఆర్టీసీ కార్గో ద్వారా పార్సిల్ డోర్ డెలివరీ అందజేస్తోంది. డోర్ డెలివరీకి వినియోగదారుల్లో ఆదరణ గణనీయంగా పెరిగింది. జిల్లాలో ఏడు ఆర్టీసీ కంటైనర్ల ద్వారా బైకలు, కందిపప్పు, బియ్యం, ఆముదాలు హైదరాబాద్, విజయనగరం తదితర ప్రాంతాలకు డోర్ డెలివరీ చేస్తున్నాం. జిల్లాలో కార్గో సేవలు మరింత అందించేందుకు చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసరావు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నంద్యాల



కర్నూలు చిల్డ్రన్స్ పార్క్‌లో జన సందడి



కర్నూలు చిల్డ్రన్స్ పార్క్ స్విమ్మింగ్‌పూల్‌లో జలకాలాట

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

రంజాన్ పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించుకున్న ముస్లింలు ఆదివారం పార్కులు, పర్యాటక స్థలాలను సందర్శించారు. కుటుంబ, బంధు,మిత్ర సమేతంగా విందు భోజనాలు చేసి ఉత్సాహంగా గడిపారు. పిల్లలు, పెద్దలు సరదాగా ఆడుకుంటూ సందడి చేశారు. కర్నూలు నగర శివారులోని సిటీఫారెస్ట్, నగరంలోని చిన్నపార్కు ముస్లిం కుటుంబాలతో కిటకిటలాడాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



నగరవనం అందాలను వీక్షిస్తూ..



నగరవనంలో ఆడుకుంటున్న చిన్నారులు



చెట్ల కింద సేదతీరిన కుటుంబాలు

క్లుప్తంగా

వెండి తలుపుల ఏర్పాటు



వెండి తలుపులకు హారతులిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో గర్భగుడికి వెళ్లే దారిలో ఉన్న తలుపుల స్థానంలో వెండి తలుపులను ఏర్పాటు చేశారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన లక్ష్మీనారాయణ అనే భక్తుడు ఇచ్చిన రూ.75 లక్షల విరాళంతో 120 కేజీల వెండిని కొనుగోలు చేసి, బెంగళూరుకు చెందిన శ్రీనివాసరాజు అనే శిల్పకారుడితో వెండి తలుపులను తయారు చేయించారు. వెండి గుమ్మాలపై దశావతరాలు, పై భాగంలో మహాలక్ష్మి అమ్మవారిని తీర్చిదిద్దారు. ఆదివారం ఉదయం శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల చేతుల మీదుగా వెండి తలుపులకు ప్రత్యేక పూజలు చేపట్టి ప్రారంభించారు. త్వరలోనే మంచాలమ్మ ఆలయంలో కుడా వెండి తలుపులు ఏర్పాటు చేస్తామని పీఠాధిపతి తెలిపారు.

యువకుడి దారుణ హత్య



సద్దాంహుసేన్ (ఫైల్)

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని స్థానిక ఆటోనగర్ సమీపంలో ఓ యువకుడు దారుణంగా హత్యకు గురయ్యాడు. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఇస్లాం పేటలో నివాసం ఉంటున్న సద్దాం హుసేన్ (23) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్నం తన స్నేహితులు ఇద్దరు భోజనానికి రమ్మని ఫోన్ చేశారని ఇంట్లో చెప్పి ఆటోనగర్‌కు వెళ్లిపోయాడు. అక్కడ ఇద్దరు యువకులు సద్దాంహుసేన్‌పై కత్తులతో దాడి చేసి హత్య చేసి పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మద్యం మత్తులో హత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పు విషయంలో హత్య జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జాతీయ రహదారులపై వెళ్లే కంటైనర్లను టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి వివరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో హైదరాబాద్ – బెంగుళూరు జాతీయ రహదారి వెళ్తున్న కంటైనర్‌లో చోరీ జరిగినట్లు ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దొంగతనానికి పాల్పడింది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంజయ్ పడిహార్‌గా గుర్తించారు. షాజాపూర్ జిల్లా ముక్వాడలో నిందితున్ని ప్యాపిలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన రూ. 6 లక్షల విలువ గల వస్తువులు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఆదివారం రిమాండ్‌కు తరలించారు. చోరీ కేసును ఛేదించిన డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీసీఎస్ సీఐ రామకృష్ణ, ఎస్ఐలు శ్రీనివాసులు, రాకేష్‌ను ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ రమణ అభినందించారు.

కరువు నేలలో 'ఉద్యాన' సిరి

- వంద ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం
- సీసీ కెమెరాలతో నిఘా
- బెంగళూరు, మంగళూరు ప్రాంతాల్లో మార్కెటింగ్
- రైతు రమేష్ చౌదరి విజయ గాథ

ఒకప్పుడు అవి బీడు భూములు.. పిచ్చి మొక్కలు తప్ప వాటిలో ఏమీ కనిపించేవి కావు.. నేడు అదే భూమిలో ఉద్యాన పంటలు కళకళలాడుతున్నాయి. కరువు నేలలో సిరులు పండుతున్నాయి. వంద ఎకరాల్లో మిశ్రమ వ్యవసాయం చేస్తున్న కె.రమేష్ చౌదరి విజయ గాథ ఇదీ..



తోటల కోసం తవ్విన కుంట

మంత్రాలయం: తెలంగాణ రాష్ట్రం గద్వాల జోగులాంబ జిల్లా శాంతినగర్‌కు చెందిన కొత్త కోటీశ్వరరావు కుమారుడు రమేష్ చౌదరి 2008లో కౌతాళానికి 5 కి.మీ.దూరంలో రౌడూరు వంకను ఆనుకుని 90 ఎకరాలు, బాపురం వంక పక్కన 25 ఎకరాలు కొనుగోలు చేశాడు. బీడు నేలలు సాగులోకి తెచ్చేందుకు మొదట్లో సుబాబుల్ మొక్కలు నాటారు. వాటికి 2018లో స్వస్తి పలికి ఉద్యాన పంటల సాగు వైపు అడుగులు వేశారు. పండ్ల తోటల సాగు కోసం 8 ఎకరాల్లో ఫాంపాండ్స్ తవ్వారు. బాపురం వంక నీటి కోసం ఒక చోట, రౌడూరు వంక నీటి నిల్వ కోసం రెండు చోట్ల 40 అడుగుల లోతు కుంటలు తవ్వించారు. వంకలకు మోటార్లను అమర్చుకుని వానాకాలంలో నీటిని కుంటలను మళ్లిస్తూ తోటలు సాగు చేస్తున్నారు.

ప్రయోగాత్మకంగా తోటలు

సెంటు భూమి ఖాళీగా లేకుండా పొలంలో తోటల సాగు చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా 15 ఎకరాల వక్క తోటలో మిశ్రమ తోటలుగా కోకో (బేకరి షాపుల్లో వాడే), మునగ, అరటి మొక్కలు నాటారు. 10 ఎకరాల నేరేడులో కొబ్బరి, కోకో మొక్కలు వేశారు. ఓ ఎకరాలో యాపిల్ పండ్ల తోట పెట్టారు. అలాగే పనస, బట్టర్ ఫ్రూట్, వాటర్ యాపిల్, ఏలుకులు, ద్రాక్ష, జాజికాయ, బిర్యాని ఆకు, స్వీట్ చింత, చెర్రిపండ్లు, మిరియాలు, మామిడి, కాఫీ, మల్బరీ ఫ్రూట్, దాల్చిన చెక్క, రామ,లక్ష్మణ,సీతా, హనుమా ఫలాలు సైతం పండిస్తున్నాడు. టేకు, మహాగని, సిల్వర్ వోక్ కలప చెట్లు పెంచుతున్నారు. తోటకు రక్షణగా, ఆదాయంగా చెర్రిపండ్ల మొక్కలు వేశారు. 50 నాటుకోళ్లు, 10 బాతులు, 10 టర్కీ కోళ్లు కూడా పెంచుతున్నారు. 30 ఎకరాల్లో తైవాన్, లక్నో, జి.విలాస్ రకాల జామ, 20 ఎకరాల్లో బాలానగర్, ఎన్ఎంకే గోల్డ్ రకాల సీతాఫలం, 30 ఎకరాల్లో తిప్టూర్ టాల్, డీఇంటుటీ హైబ్రిడ్, సిల్వాన్ రకాల కొబ్బరిచెట్లు, 15 ఎకరాల్లో వక్క మొక్కలు,10 ఎకరాల్లో నల్ల నేరేడు తోటలు సాగు చేశారు.



సాగులో ఉన్న జామ తోట

సీసీ కెమెరాల నిఘా

తోట మధ్యలో ఫామ్‌హౌస్ నిర్మించుకుని వనాలను పర్యవేక్షిస్తున్నారు. బెంగుళూరులో నివాసముంటూ నెలలో పది రోజులు ఇక్కడే ఉంటూ తోటల నిర్వహణ చూసుకుంటున్నారు. తోటలోకి ప్రవేశించడానికి ఒకే ఒక్క మార్గాన్ని ఏర్పాటు చేశారు. గేటు నుంచే ఆయన క్షేత్రంలో సీసీ కెమెరాలు అమర్చారు. రూ.12 లక్షలు వెచ్చించి 16 సీసీ కెమెరాలు, 08 అత్యాధునిక డిజిటల్ కెమెరాలు ఏర్పాటు చేశారు. అర కి.మీ. దూరంలోని మాటలను, శబ్దాలను రికార్డు చేసే నాలుగు 4జీ కెమెరాలు ఉన్నాయి. బెంగుళూరు నుంచే తోటల నిఘాను వీక్షిస్తున్నారు.

రూ.15 లక్షల ఆదాయం



క్షేత్రంలో సీతాఫలం, జామ తోటల నుంచి ఖర్చులు పోను రూ.15 లక్షల ఆదాయం వచ్చింది. మూడేళ్లు గడిస్తే ఏటా రూ.కోటి రూపాయలకు పైగా సంపాదన వస్తుందని ఆశిస్తున్నా. తోటలో 40 మంది కూలీలు ప్రతి రోజూ పనిచేస్తున్నారు. మంగళూరు, రాయచూర్, శిరుగుప్ప, బెంగళూరు, ఆదోని ప్రాంతాల్లో మార్కెటింగ్ చేస్తున్నా. ఇక్కడే కాకుండా శాంతినగర్‌లో 25 ఎకరాల్లో నిమ్మ, మామిడి, శిరుగుప్పలో వరిపంట సాగుచేస్తున్నా. ఆదోని ప్రాంత రైతులు ఇంకా పాత పద్ధతుల్లోనే వ్యవసాయం చేసుకుంటున్నారు. ఉద్యానవన పంటలపై అవగాహన తక్కువ ఉంది. వాణిజ్య పంటలను విడనాడి పండ్ల తోటలపై దృష్టి సారిస్తే ఈ ప్రాంత రైతులు సాగు రాణించడం సాధ్యపడుతుంది.

– కె.రమేష్ చౌదరి

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై హత్యాయత్నం

- అరగంట వ్యవధిలో మరో ఇద్దరిపై దాడి
- కాలనీలో అల్లరి చేయొద్దన్నందుకు రెచ్చిపోయిన అల్లరిమూకలు

కర్నూలు: కర్నూలు మండలం పసుపుల గ్రామ పరిధిలోని బాలాజీ విల్లాస్‌లో నివాసం ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జగదీశ్వర్‌రెడ్డి (45)పై హత్యాయత్నం జరిగింది. జగదీశ్వర్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేసేవాడు. కంపెనీ నిర్వాహకులు వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రకటించడంతో కొంతకాలంగా ఇంటి వద్దనే విధులు నిర్వహిస్తున్నాడు. బీ తాండ్రపాడు గ్రామంలో నివాసం ఉంటున్న నాగరాజు ఇంటి పక్కన రాకేష్‌తోపాటు మరో ఐదుగురు విద్యార్థులు అద్దెకు ఉంటున్నారు. ప్రతి రోజూ గదిలో మద్యం సేవిస్తూ అల్లరి చేస్తుండడంతో తాండ్రపాడుకు చెందిన నాగరాజు విద్యార్థులను దండించడంతో నువ్వు ఎవరూ చెప్పడానికి అంటూ అతనిపై దాడి చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానంటూ కాలనీ సమీపంలోని ఓ జిరాక్స్ సెంటర్ దగ్గర నిల్చుని ఉండగా రెండవసారి దాడి చేశారు. అడ్డుకోబోయిన పుల్లారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల వాచ్‌మెన్‌పై కూడా దాడి చేసి గాయపరిచారు. ఓ యువతి ఫోన్ నంబర్ ఇవ్వాలంటూ రాకేష్‌తో పాటు మరికొంతమంది పోకిరీలు అల్లరి చేస్తుండడంతో జగదీశ్వర్‌రెడ్డి ఇది పద్ధతి కాదంటూ అడ్డు చెప్పినందుకు అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అల్లరిమూకలు దాడికి చేసిన సంఘటన కాలనీలోని సీసీ ఫుటేజీలో రికార్డు కావడంతో వాటిని సేకరించి బాధితులు వేర్వేరుగా కర్నూలు అర్బన్ తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రాకేష్ తండ్రిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జగదీశ్వర్‌రెడ్డి.. సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డికి సమీప బంధువు కావడంతో దాడి సంఘటనను ఎస్పీ కృష్ణకాంత్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.



సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జగదీశ్వర్‌రెడ్డిపై దాడి చేస్తున్న అల్లరి మూకలు

రెండు పంచాయతీలకు రాష్ట్రస్థాయి అవార్డులు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు గ్రామ పంచాయతీలు రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9 రకాల అంశాలపై నిర్వహించిన సర్వేలో కర్నూలు జిల్లాలోని ఆదోని మండలం మండగిరి, నంద్యాల జిల్లాలోని బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట గ్రామ పంచాయతీలు వేర్వేరు అంశాల్లో ప్రగతి చూపాయన్నారు. ఈ రెండు గ్రామ పంచాయతీలు రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. సామాజిక భద్రతకు సంబంధించి మండగిరి, అవసరాల మేరకు తాగునీటిని అందించడంలో ఇల్లూరు కొత్తపేట గ్రామ పంచాయతీలు ఎంపికయ్యాయన్నారు. ఈ రెండు పంచాయతీలకు సంబంధించిన సర్పంచు లేదంటే ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 24వ తేదీన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం అందించనుందన్నారు.

జిల్లాలో 27 ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపిక

తొమ్మిది అంశాల్లో జిల్లా స్థాయి కమిటీ నిర్వహించిన సర్వేలో 27 గ్రామ పంచాయతీలు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైనట్లు డీపీఓ తెలిపారు. రెండు జిల్లాల్లోని ఆయా మండలాలకు సంబంధించి చాగలమర్రి, తారాపురం, ఎర్రగుంట్ల, హొలహర్వి, మహదేవపురం, యు బొల్లవరం, గంగవరం, రాంపురం, ఎల్లమ్మగుట్టతాండా, బ్రాహ్మణపల్లె, రామకృష్ణాపురం, ఐ కొత్తపేట, బనగానపల్లె, పాండవగళ్లు, శిరివెళ్ల, మాంత్రికి, పాణ్యం, సాతనూరు, కానాల, మండగిరి, పలుకూరు, సిమెంట్‌నగర్, ఆలమూరు, విరుపాపురం, బనగానపల్లె, మేకడోన, గుడెంబాయితాండా జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికయ్యాయన్నారు. ఈ పంచాయతీలకు జిల్లా స్థాయిలో అవార్డులను అందించనున్నట్లు తెలిపారు.

బసవేశ్వరుని ఆశయాలను సాధిద్దాం

- రాష్ట్ర వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ ఛైర్మన్ వై రుద్రగౌడ్

కర్నూలు(అర్బన్): పేద, ధనిక అనే బేధ భావం లేకుండా 12వ శతాబ్దంలోనే అందరూ సమానమనే భావనను ఇనుమడింపజేసిన బసవేశ్వర స్వామి ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర వీర శైవ లింగాయతీ కార్పొరేషన్ ఛైర్మన్ వై రుద్రగౌడ్ కోరారు. ఆదివారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో మహాత్మా బసవేశ్వరస్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వీరశైవ లింగాయతీ ఐక్యవేదిక అధ్యక్షులు మల్లికార్జున స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా బసవేశ్వర స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రుద్రగౌడ్ మాట్లాడుతూ.. మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వీరశైవ లింగాయతీలను బీసీ–డీ జాబితాలో చేర్చి ఎంతో మేలు చేయగా, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరశైవ లింగాయతీలకు రాష్ట్రంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. వీరశైవుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉన్న వీరశైవులను కేంద్రంలో ఓబీసీలుగా గుర్తించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోరతామన్నారు. కర్నూలు నగరంలో బసవేశ్వర స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. గ్రామాలు, పట్టణాలకే పరిమితమైన బసవ జయంతిని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ నాగేశ్వరరావు, ఏఈఓ జాకీర్‌హుసేన్, వీర శైవ లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్లు మంజుల, సుమంగళ, గోపాల్‌రెడ్డి, మంజుల, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ రేవతి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కల్పన, వీరశైవ సమాజానికి చెందిన పెద్దలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వై. రుద్రగౌడ్

బావిలో పడి గురుకుల విద్యార్థి మృతి

- విద్యార్థి తల్లిదండ్రులు, ప్రజా సంఘాల ఆందోళన
- పాఠశాల ప్రిన్సిపాల్, కేర్‌టేకర్‌పై చర్యలకు డిమాండ్

జూపాడుబంగ్లా: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం. నగేష్ బావిలో పడి మృతి చెందాడు. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన ఎం.రామకృష్ణ, ఐశ్వర్య దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు నగేష్ 2018–19 నుంచి ఇక్కడే విద్యనభ్యసిస్తున్నాడు. శనివారం ఉదయం పాఠశాల సమీపంలోని బావిలో ఈతకొట్టేందుకు కొందరు విద్యార్థులతో నగేష్ కలసి వెళ్లాడు. 11.30 గంటల ప్రాంతంలో నగేష్ తప్ప మిగతా విద్యార్థులు పాఠశాలకు తిరిగి చేరుకున్నారు. రాత్రి 9.30 గంటల వరకు కూడా నగేష్ రాకపోవడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం పాఠశాల చేరుకున్న వారు తమ కుమారుడి ఆచూకీ చెప్పాలంటూ నిలదీశారు. మధ్యాహ్నం ప్రిన్సిపాల్ రాజు, తల్లిదండ్రులు నగేష్ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానంతో బావి వద్ద గాలించారు. నీళ్లు ఎక్కువగా ఉండటంతో పూర్తిగా గాలించేందుకు సాధ్యం కాలేదు. కాగా సాయంత్రం 6 గంటల సమయంలో బావిలో విద్యార్థి శవమై కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య వారి సిబ్బందితో సంఘటనా ప్రాంతం వద్దకు చేరుకొని బావిలోంచి మృతదేహాన్ని వెలికితీయించారు. పాఠశాలలో విద్యార్థి కనిపించకుండా పోతే సమీపంలో ఉన్న పోలీసుస్టేషన్‌లో ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రిన్సిపాల్ రాజు, కేర్‌టేకర్, హాస్‌మాస్టర్, ఉపాధ్యాయులపై సీఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు ఆర్డీఓ ఎం. దాసు సంఘటనా ప్రాంతానికి చేరుకుని విద్యార్థి మృతిపై ఆరా తీశారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తా మని విద్యార్థి తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. కాగా నగేష్‌కు ఈత రాకపోవడంతో నేర్చుకునేందుకు వెళ్లి నీటమునిగి ఉంటాడని అనుమానం వ్యక్తమవుతోంది. కాగా ఇదే పాఠశాలలో గతంలో సిబ్బంది నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు ఐదుగురు విద్యార్థులు ప్రమాదాల బారిన పడి మృతి చెందారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య



నగేష్ (ఫైల్)

మృతదేహంతో పాఠశాల వద్ద ధర్నా

గురుకులం విద్యార్థి బావిలో పడి మృతిచెందిన విషయం తెలుసుకొన్న సీపీఐ నాయకుడు రమేష్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, విద్యార్థిసంఘం నాయకుడు శ్రీనివాసులు, మృతిచెందిన విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు తదితరులు సంఘటనా ప్రాంతానికి చేరుకొన్నారు. మృతదేహంతో గురుకుల పాఠశాల వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. విద్యార్థి నగేష్ మృతికి కారణమైన ప్రిన్సిపాల్, కేర్‌టేకర్, హాస్‌మాస్టర్‌పై కేసులు నమోదు చేసి వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, ఇప్పించాలని డిమాండ్ చేశారు.



సంఘటన స్థలంలో రోదిస్తున్న విద్యార్థి తల్లి

అధికారుల విచారణ

జూపాడుబంగ్లా గురుకులానికి చెందిన విద్యార్థి బావిలో పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ టెక్నికల్ డిప్యూటీ సెక్రటరీ యోగేశ్వరరావు జూపాడుబంగ్లాకు చేరుకుని విచారణ చేపట్టారు. విద్యార్థి మృతికి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కనిపిస్తుందని ఆర్డీఓ ఎం.దాసు వారికి వివరించారు.